సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 2 । జూన్ । 2024



వైభవంగా బ్రహ్మోత్సవాలు

జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరిలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. 8లో ▸



విత్తన ఎంపికే కీలకం

రైతులు సార్వా సాగులో చీడపీడలను తట్టుకుని మంచి దిగుబడులిచ్చే వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 8లో ▸



పులి అడుగుజాడలు ?

బందంచర్ల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తుందని స్థానికులు అంటున్నారు. రిజర్వు ఫారెస్ట్‌లో పులి అడుగు జాడలను గుర్తించామని చెబుతున్నారు. 8లో ▸

భద్రత కట్టుదిట్టం

ప్రశాంతంగా.. పారదర్శకంగా..
- కౌంటింగ్‌కు భారీ బందోబస్తు
- ఒక్కో అసెంబ్లీ స్థానం పర్యవేక్షణకు ఒక్కో డీఎస్పీ
- ప్రధాన పార్టీ అభ్యర్థుల వెంట షాడో బృందం
- అభ్యర్థుల నివాసాలు, పార్టీ కార్యాలయాల వద్ద భారీ భద్రత
- ఏలూరు రేంజ్‌లో కార్డెన్ అండ్ సెర్చ్, మాక్‌డ్రిల్‌లు పూర్తి



భీమవరంలో కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు ఏలూరు రేంజ్ పోలీసులు పూర్తిస్థాయిలో సమాయత్తమయ్యారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత మొదలు సమస్యాత్మక గ్రామాల్లో పికెటింగ్‌ల వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా భద్రతాపరంగా అత్యధిక చర్యలు తీసుకున్నారు. ప్రధాన పార్టీ అభ్యర్థుల వెంట షాడో బృందాలు ఏర్పాటు చేయడం, రాజకీయ పార్టీల కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్ల వద్ద భద్రత ఇలా అన్ని అంశాలను పరిగణనలోనికి తీసుకుని భారీగా బందోబస్తు ఏర్పాటుచేశారు. కౌంటింగ్ జరిగే మంగళవారం ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా పూర్తి ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

600 మందితో బందోబస్తు

కౌంటింగ్ కేంద్రాల భద్రతపై కీలక దృష్టి సారించారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రారంభంలో 40 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఏఆర్ పోలీసులు ఉంటారు. అలాగే మొబైల్, ఇతర ఎల్రక్టానిక్ పరికరాలను డిపాజిట్ చేయడానికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేశారు. ప్రతి కౌంటర్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. నియోజకవర్గాల సంఖ్యను బట్టి పోలీసు సిబ్బందిని కేటాయించారు. ఏలూరు జిల్లాకు సంబంధించి 7 నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు జరిగే సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వద్ద సుమారు 600 మంది సిబ్బందిని కేటాయించారు. ప్రతి హాలు వద్ద సీఐ, ఎస్సైతో పాటు పూర్తిస్థాయిలో పోలీసులు విధుల్లో ఉంటారు. కౌంటింగ్ కేంద్రం గేటు వద్ద తనిఖీలు చేసి అభ్యర్థులు, ఏజెంట్లు, అధికారులు, అనుమతి ఉన్నవారిని మాత్రమే పంపించేలా మూడంచెల తనిఖీ విధానాన్ని ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీలు కౌంటింగ్ రోజున ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడంపై పూర్తిస్థాయిలో నిషేధాజ్ఞలు ఉన్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల మద్యం, బాణసంచా నిల్వలను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.



ముందస్తు ప్రణాళికలతో..

సమస్యాత్మక ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ పూర్తి చేశాం. అలాగే కార్డెన్ అండ్ సెర్చ్‌లు కూడా పూర్తి చేశాం. గ్రామసభలు నిర్వహించి రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించాం. అల్లర్లకు ఆస్కారం లేకుండా అందరూ సహకరించేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు భారీగా బందోబస్తు ఏర్పాట్లుచేశాం.

– జీవీజీ అశోక్‌కుమార్, ఐజీ, ఏలూరు రేంజ్

ట్రాఫిక్ డైవర్షన్లు.. చెక్‌పోస్టులు

ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో కౌంటింగ్ కేంద్రాలకు రెండువైపులా కలిపి కిలోమీటరు మేర ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటుచేశారు. అలాగే ఆయా జిల్లాల సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తారు. కౌంటింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతంలోని లాడ్జీలు, హోటళ్లు, కల్యాణ మండపాలకు నోటీసులు జారీ చేశారు. అనవసరమైనవారిని అనుమతించడం, మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలు విధించారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులకు షాడో టీమ్‌లు బందోబస్తుగా ఏర్పాటుచేశారు. జిల్లా పోలీస్ సిబ్బందిలో సగం మందికిపైగా కౌంటింగ్ విధుల్లో, మరో సగం మంది వివిధ రకాల బందోబస్తు, పికెటింగ్‌లలో ఉండనున్నారు.

ఒక డీఎస్పీ చొప్పున..

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక డీఎస్పీని నియమించారు. ఆయా నియోజకవర్గాల్లో సమస్యాత్మక, సున్నితమైన గ్రామాల్లో పికెటింగ్‌లు ఏర్పాటుచేశారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో సీఐ, ఎస్సైలు పెట్రోలింగ్ నిర్వహిస్తారు. డీఎస్పీ నియోకవర్గమంతా పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో అవసరాన్ని బట్టి 20 మంది వరకు పోలీసులను ఏర్పాటుచేస్తారు. రాజకీయ పార్టీల జిల్లా, నియోజకవర్గ కార్యాలయాలు, ప్రధాన పార్టీల కార్యాలయాలు, నివాసాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో అల్లర్లు జరిగిన ప్రాంతాలను, సమస్యాత్మక ప్రాంతాల్లో సమస్యాత్మక వ్యక్తులను ముందస్తుగా అరెస్టులు చేయనున్నారు.

ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లను పక్కాగా, త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఈనెల 4న ఓట్ల లెక్కింపు జరిగే భీమవరంలోని విష్ణు ఇంజనీరింగ్, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో కౌంటింగ్ కేంద్రాలను, మీడియా సెంటర్లను శనివారం ఆయన పరిశీలించారు. ముందుగా విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని, మీడియా సెంటర్‌ను పరిశీలించి మీడియా సెంటర్‌లో హైస్పీడ్ ఇంటర్నెట్, వైఫై కనెక్టివిటీ, టెలివిజన్ల ఏర్పాటులకు సూచనలు ఇచ్చారు. అనంతరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఉండి నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి పరిశీలించారు. టేబుళ్ల అమరిక, రౌండ్ల వారీగా వివరాల ప్రొఫార్మాలు, ఎన్ కోర్‌లో డేటా నమోదు, అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది చేరుకునే మార్గాలు తదితర విషయాలపై చర్చించారు. అభ్యర్థులు, ఏజెంట్లు కేంద్రాల్లోకి వెళ్లే మార్గాలను సూచించే బోర్డులు స్పష్టంగా ఉండేలా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు.

కౌంటింగ్ రోజున ట్రాఫిక్ మళ్లింపు

జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత

భీమవరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా భీమవరంలోని విష్ణు కాలేజీ క్యాంపస్, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటుచేసిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత ఈనెల 4న (మంగళవారం) భీమవరం పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపుకు చర్యలు తీసుకున్నారు.

- విజయవాడ, గుడివాడ వైపు నుంచి వచ్చే వాహనాలు కాళ్ల మండలం పెద అమిరం పుంత రోడ్డు మీదుగా ఉండి రోడ్డుకు చేరుకుని పట్టణంలోకి ప్రవేశించాలి. పట్టణం నుండి వచ్చే కారు, బైక్‌లు సర్ ఆర్థర్ కాటన్ పార్క్ (జువ్వలపాలెం రోడ్డు) వద్ద డైవర్షన్ తీసుకుని చిన అమిరం మీదుగా కోపల్లె హైస్కూల్ వద్ద కాళ్ల రోడ్డు మీదుగా గుడివాడ, విజయవాడ వైపు వెళ్లాలి.
- పాలకొల్లు వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు బొంబాయి స్వీట్స్ వద్ద ఉండి రోడ్డులోకి వచ్చి మల్టీప్లెక్స్ మీదుగా ఉండి, ఆకివీడు, కైకలూరు, విజయవాడ, గణపవరం, ఏలూరు వైపు, పెద అమిరం పుంత రోడ్డు నుంచి కాళ్ల, గుడివాడ వైపు వెళ్లాలి.
- తాడేపల్లిగూడెం నుంచి వచ్చే వాహనాలు గొల్లలకోడేరు వంతెన వద్ద డైవర్షన్ తీసుకుని పాలకోడేరు, కుముదవల్లి, మార్కెట్ యార్డ్ మీదుగా పాలకొల్లు వైపు, భీమవరం పట్టణంలో ఉండి వైపునకు వెళ్లాలి. భీమవరం నుంచి తాడేపల్లిగూడెం, తణుకు వెళ్లే వాహనాలు బీవీ రాజు విగ్రహం వద్ద నుంచి ఉండి బైపాస్ మీదుగా మార్కెట్‌యార్డ్, కుముదవల్లి, పాలకోడేరు మీదుగా పయనించాలి.
- జువ్వలపాలెం రోడ్డులో సర్ ఆర్థర్ కాటన్ పార్క్ వద్ద నుంచి కాళ్ల రోడ్డులో పెద అమిరం పుంత రోడ్డు వరకు, అలాగే ఉండి బైపాస్ రోడ్డులోని బీవీ రాజు విగ్రహం నుంచి గొల్లలకోడేరు విగ్రహం వరకు కూడా నో వెహికల్ జోన్‌గా ప్రకటించారు.

వాహనాల పార్కింగ్ ఇలా..

- కౌంటింగ్ కేంద్రాల వద్దకు వచ్చేవారి వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎస్పీ అజిత తెలిపారు.
- ఆచంట, తణుకు నియోజకవర్గాల నుంచి వచ్చేవారు విష్ణు క్యాంపస్ సమీపంలోని అంజన, సంజన అపార్టుమెంట్ వద్ద..
- నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల నుంచి వచ్చేవారు కొవ్వాడ అన్నవరం రోడ్డు మీదుగా విష్ణు ప్లే గ్రౌండ్‌లో..
- భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల నుంచి వచ్చేవారు నాగరాజు మాల్ వద్ద..
- ఉండి నియోజకవర్గం నుంచి వచ్చేవారు కాళ్ల రోడ్డులోని శ్రీరామ కోల్డ్ స్టోరేజ్ వద్ద వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

నీటిపారుదల శాఖ పనితీరు భేష్

జెడ్పీ సమావేశంలో జెడ్పీటీసీలు




మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు

ఏలూరు(మెట్రో): మండు వేసవిని తట్టుకుంటూ అటు సాగునీరు, ఇటు తాగునీటి అవసరాలు తీర్చడంలో జిల్లా ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సేవలు భేష్ అని జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు అన్నారు. ఏలూరులోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన శనివారం జెడ్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రబీ సీజన్‌కు మే 10 వరకు సాగునీరు అందించారని, తాగునీటి అవసరాల కోసం 50 టీఎంసీల నీటిని కేటాయించి ప్రజల దాహార్తిని తీర్చారని హర్షం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా నిర్వహించి క్రాష్ కార్యక్రమం ద్వారా 4,600 పైగా హ్యాండ్ పంపుల మరమ్మతులు, గోదావరి డెల్టాపై ఆధారపడి ఉన్న 77 తాగునీటి చెరువులను సమృద్ధిగా నింపి జూన్ నెలకు సైతం తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. పెదపాడు, ఏలూరు, కైకలూరు మండలాల్లో కృష్ణా డెల్టాపై ఆధారపడి ఉన్న 196 చెరువులను పులిచింతల, నాగార్జునసాగర్ జలాలతో నింపడం అభినందనీయమన్నారు. సాగునీటి అవసరాలను తీర్చడంలో జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రత్యేక కృషి చేశారన్నారు.

త్వరితగతిన నాడు–నేడు పనులు

ఈనెల 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ఆదేశించారు. ఇప్పటికే పాఠ్యపుస్తకాల పంపిణీ 50 శాతం పూర్తయ్యిందని, మిగిలినవి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటిని సైతం సకాలంలో పంపిణీ చేయాలన్నారు. రైతులకు సాగునీరు సమృద్ధిగా అందించిన విధంగా విత్తనాలు సైతం అందుబాటులో ఉంచి సకాలంలో నారుమడులు పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, ఇరిగేషన్ ఎస్ఈ ఎం.రవిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎంవీవీ సత్యనారాయణ, గృహనిర్మాణ శాఖ అధికారి రవికుమార్, హార్టీకల్చర్ డీడీ దుర్గేష్, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ఓపెన్' పరీక్షలు

భీమవరం: జిల్లావ్యాప్తంగా శనివారం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) టెన్త్, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు 88 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి తెలిపారు. టెన్త్ పరీక్షకు 217 మంది విద్యార్థులకు 186 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షకు 355 మందికి 319 మంది హాజరయ్యారన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 8 పరీక్షా కేంద్రాలను, రాష్ట్రస్థాయి పరిశీలకులు రెండు కేంద్రాలను తనిఖీ చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ నాగమణి తెలిపారు.

శాంతి పథం.. ప్రగతికి మార్గం

కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

భీమవరం (ప్రకాశంచౌక్): శాంతి, సహనం, అహింసా గుణాలు సమాజ ప్రగతికి మార్గదర్శకాలని, శాంతి పథంలో జీవితం పరమార్థమని, జరుగుతున్న పరిణామాల్లో శాంతి, సామరస్యం ఎంతైనా అవసరమని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. స్వీప్ యాక్టివిటీస్‌లో భాగంగా కౌంటింగ్ రోజున శాంతి సామరస్యాలతో మెలగాలనే నినాదంతో ప్రచార భేరి కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు సహజమని, ఓటు వజ్రాయుధమని, కౌంటింగ్‌లో ప్రతిఒక్కరూ సమన్వయం పాటించాలని అన్నారు. స్వీప్ యాక్టివిటీస్ ప్రజల్లో అవగాహన కల్పించేలా ఇటువంటి ప్రచార భేరి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని అన్నారు. యాక్టివిటీస్ జిల్లా బ్రాండ్ అంబాసిడర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ స్వీప్ ఎన్నికల అధికారులకు పోలీస్ అధికారులకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు కంతేటి వెంకటరాజు, లయన్స్ జోన్ చైర్మన్ నందమూరి రాజేష్, బాబాజీ సాహెబ్ పాల్గొన్నారు.

అసహాయశూర.. అంజనీకుమార..

మద్దిలో ఘనంగా హనుమద్ జయంతి



విశేష అలంకరణలో స్వామివారు



భక్తులకు అన్నప్రసాద వితరణ



మద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో భక్తుల రద్దీ

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రముఖ హనుమాన్ క్షేత్రం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో హనుమద్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వేకువ జాము నుంచే స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, లక్ష తమలపాకులతో లక్షార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. జంగారెడ్డిగూడెం ఆర్డీఓ అద్దయ్య స్వామి వారిని దర్శించుకున్నారు. సీఐ రాజేష్, ఎస్సై సుధీర్‌లు తన సిబ్బందితో కలిసి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్సవాల్లో నేడు.. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహించనున్నట్టు ఈఓ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం, నిత్యహోమాలు, బలిహరణలు, నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సమృద్ధిగా సాగునీరు

- ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో నీటి సరఫరా
- రూ.33 కోట్లతో కాలువల అభివృద్ధి పనులు
- 80 టీఎంసీల నీరు అవసరమని అంచనా
- వ్యవసాయ శాఖ ప్రణాళిక



ఏలూరు(మెట్రో): అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అన్నింటా అండగా నిలుస్తోంది. గతేడాది ఖరీఫ్ మాదిరిగా ఈ సీజన్‌లోనూ వ్యవసాయానికి సమృద్ధిగా సాగు నీరందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు పశ్చిమ డెల్టాపై ఆధారపడి ఉన్న ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు సాగునీరు అందించేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళికలు రూపొందించింది.

శివారు ప్రాంతాలకూ.. ఖరీఫ్ సాగుకు సంబంధించి పశ్చిమ డెల్టా ద్వారా సాగునీరు అందించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు శనివారం ఉదయం 10.30 గంటలకు చర్యలు తీసుకున్నారు. శివారు ప్రాంతాల వరకూ సాగునీరు అందించేలా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌కు వరుణుడు కరుణతో పాటు గోదావరి జలాలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద ప్రస్తుతం అందుబాటులో సాగునీరు ఉంది. ఇక్కడి నుంచే ఉభయగోదావరి జిల్లాల్లోని మూడు డెల్టాలకు సాగునీరు అందించనున్నారు.

5.29 లక్షల ఎకరాలు

ఉభయగోదావరి జిల్లాలతో పాటు తూర్పుగోదావరిలో కలిసిన ప్రాంతాలతో సహా కలిపి ఉమ్మడి పశ్చిమగోదావరిలో పశ్చిమ డెల్టాపై 5.29 లక్షల ఎకరాలకు సాగునీరు అందిచేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ప్రధానంగా గోదావరి జలాలను అందించనున్నారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందే సాగునీరు విడుదల చేసి రైతులు సాగు ప్రారంభించే సమయానికి సమృద్ధిగా నీరందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

80 టీఎంసీల వరకు..

పశ్చిమ డెల్టాపై ఆధారపడిన 5.29 లక్షల ఎకరాల సాగుకు 75 నుంచి 80 టీఎంసీల సాగునీరు అవసరం ఉంది. ఖరీఫ్ సాగు ముగింపు నాటికి అవసరమైన నీటిని ఇరిగేషన్ అధికారులు అందించాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఇప్పటికే గోదావరి ఇన్‌ఫ్లో 4 వేల క్యూసెక్కులు ధవళేశ్వరానికి చేరుకోవడంతో విడతల వారీగా పశ్చిమ డెల్టాకు నీటి విడుదల సామర్థ్యాన్ని పెంచనున్నారు. ఇదిలా ఉండగా తమ్మిలేరు, ఎర్రకాలువ, కొవ్వాడ జలాశయాలపై ఆధారపడి ఉన్న సాగుకు ఆయా జలాశయాల్లో సాగునీరు లేకపోవడంతో పూర్తిగా వర్షాభావంతోనే పంటలు పండించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో కురిసే వర్షాల ఆధారంగా మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రూ.33 కోట్లతో ప్రణాళికలు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన వెంటనే కాలువల్లో తూడు తొలగింపు, గడ్డి తొలగింపు, కాలువల మరమ్మతులు, గేట్ల రిపేర్లు వంటి పనులను చేపట్టేందుకు రూ.33 కోట్లతో ఇప్పటికే అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఆ ప్రణాళికలు ప్రకారం రానున్న రోజుల్లో అవసరమైన ప్రాంతాల్లో మరమ్మతులు చేసి సజావుగా పశ్చిమ డెల్టాకు సాగునీరు అందిచేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

న్యూస్‌రీల్

సబ్ జైలు తనిఖీ



సబ్‌జైలులో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ్‌కుమార్

భీమవరం: పట్టణంలోని స్పెషల్ సబ్ జైలు పరిసరాలను, ముద్దాయిల బ్యారక్‌లు, వంటశాల, స్టోర్ రూమ్, ఆఫీస్ గదులను శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తమ్‌కుమార్ తనిఖీ చేశారు. ముద్దాయిలకు అందుతున్న భోజన వసతులు, డాక్టర్ విజిట్‌పై జైలు సూపరింటెండెంట్ డి.వెంకటగిరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ముద్దాయిలతో మాట్లాడి వారి కేసు వివరాలను తెలుసుకున్నారు. బెయిల్, ష్యూరిటీ వివరాలను సంబంధిత కోర్టు న్యాయమూర్తి, ముద్దాయి తరఫు న్యాయవాదిని అడిగి కేసు విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని ముద్దాయిలకు మండల న్యాయ సేవా సంస్థ తరఫున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, భీమవరం సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి పి.మనీషా, 2వ అదనపు సివిల్ జడ్జి డి.ధనరాజు, న్యాయవాదులు అంబేద్కర్, లోకేశ్వరరావు తదితరులు ఉన్నారు.

తణుకు ప్రభుత్వాస్పత్రిలో డిజిటల్ ఎక్స్‌రే



ఎక్స్‌రే మెషీన్లను ప్రారంభిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో డిజిటల్ ఎక్స్‌రే మెషీన్లు అందుబాటులోకి రావడం శుభ పరిణామమని ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. ఆస్పత్రికి రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన 300 ఎంఏ, 500 ఎంఏ డిజిటల్ ఎక్స్‌రే మెషీన్లను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ విధానంలో అత్యాధునిక పద్ధతిలో ఎక్స్‌రే తీసే పరికరాలు అందుబాటులోకి రావడం వలన ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ విభాగాలకు వచ్చే రోగులకు సత్వర సేవలు అందుతాయన్నారు. ఎక్స్‌రేలకు సంబంధించిన ఫిల్మ్ డిజిటల్ విధానంలో త్వరితగతిన వైద్యులకు చేరుతుందని, తద్వారా రోగులకు సకాలంలోనే సంబంధిత శస్త్రచికిత్సలు చేయడమే కాకుండా అవసరమైన మందులు పంపిణీ చేసే వెసులుబాటు కలుగుతుందన్నారు. అలాగే తక్కువ సమయంలోనే ఎక్కువ సేవలు అందించే సౌకర్యం కూడా ఉంటుందన్నారు.

ప్రశాంతంగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

భీమవరం: జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయని డీఈఓ జి.నాగమణి ప్రకటనలో తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్–2, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–1 పరీక్షలకు 197 మంది విద్యార్థులకు 141 మంది గైర్హాజరయ్యారన్నారు. కేవలం 56 మంది మాత్రమే హాజరయ్యారని తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

పోటెత్తిన భక్తులు



వైకుంఠం కాంప్లెక్స్‌లో భక్తులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమ చినవెంకన్న క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేలాదిగా ఆలయానికి తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంతో పాటు అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల తదితర విభాగాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ అధికారులు క్యూలైన్ల వద్ద ఎయిర్ కూలర్లను ఏర్పాటుచేశారు. భక్తులకు నిరంతరాయంగా మంచి నీటిని అందించారు. అనివేటి మండపంలో భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి.

క్లుప్తంగా

విజిలెన్స్ అధికారుల తనిఖీలు



ఆచంటలో విజిలెన్స్ దాడులు

పెనుగొండ : ఆచంటలో అనుమతులు లేకుండా విత్తనాలు నిల్వ ఉంచారన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు దాడులుచేసి కేసు నమోదు చేశారు. పెనుగొండ మండలం చిన మల్లంకు చెందిన ధాన్యలక్ష్మీ సీడ్స్ ఎలాంటి అనుమతులు లేకుండా ఆచంటలో గొడౌన్‌లో నిలువ ఉంచారన్న సమాచారంతో శనివారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేయగా రూ.51,80,400 విలువ చేసే 2590.20 క్వింటాళ్ల వరి విత్తనాలు గుర్తించి, యజమాని దమ్మా రవీంద్రపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయ శాఖాధికారి పి.సురేష్, విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్, విజిలెన్స్ ఏఈఈ ఎం రూపేష్ వర్మ, వ్యవసాయాదికారి జి సత్యనారాయణలు పాల్గొన్నారు.

బందంచర్ల ప్రాంతంలో పులి అడుగుజాడలు?



టి.నరసాపురం మండలం బందంచర్ల అటవీ ప్రాంతంలో అడుగుజాడలు పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

టి.నరసాపురం: బందంచర్ల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తుందని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పడమర వైపున ఉన్న రైతుల పొలాల సమీపంలోని రిజర్వు ఫారెస్ట్‌లో పులి అడుగు జాడలను గుర్తించామని వారు పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలియజేయగా, బందంచర్ల ఫారెస్ట్ బీట్ అధికారిణి భవానీ, యర్రగుంటపల్లి ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది పులి సంచరించిందని చెబుతున్న ప్రదేశాలను శనివారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో కనిపించిన కాలి ముద్రలను గుర్తించి జిల్లా ఫారెస్ట్ అధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ సిబ్బంది కోరారు.

విత్తన ఎంపికే కీలకం



ఎంటియు -7029(స్వర్ణ)



ఎంటియు 1318

భీమవరం: వ్యవసాయమే జీవనాధారమైన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎక్కువ మంది రైతులు వరిసాగుపైనే ఆధారపడుతున్నారు. ఇటీవల సాగు ఖర్చులు పెరగడం, కూలీల కొరత, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగడంతో మంచి దిగుబడులు సాధించే వరి వంగడాలపై రైతులు దృష్టిసారిస్తున్నారు. చీడపీడలను తట్టుకుని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించడానికి రైతులు కృషిచేస్తున్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాగు పెట్టుబడి అందించడంతోపాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా తక్కువ ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయించడంతో కొంతమేరకు ఊరటనిస్తున్నాయి. ప్రస్తుతం రైతులంతా సార్వా సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో చీడపీడలను తట్టుకుని మంచి దిగుబడులిచ్చే వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయశాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇబ్బడిముబ్బడిగా ఎరువులు వాడకం వల్ల ఖర్చు పెరగడమేగాక తెగుళ్లు ఆశిస్తాయని మంచి విత్తనాలను ఎంపిక చేసుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 5.40 లక్షల ఎకరాల్లో సార్వా సాగుచేయాల్సివుంది. ఇలాంటి తరుణంలో విత్తన ఎంపిక పట్ల జాగ్రత్తలు తీసుకుంటే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

ఎంటీయు –7029(స్వర్ణ)

1982లో స్వర్ణ రకం విడుదల చేయగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతోపాటు శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, విజయనగరం, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి తదితర జిల్లాలకు అనువుగా ఉంటుంది. ఎరుపు రంగు ధాన్యం తక్కువ నత్రజనితో అధిక దిగుబడినిచ్చే ఈ రకం చౌడు భూముల్లో సైతం మంచి దిగుబడి ఇస్తుంది. 150 రోజుల్లో పంటకు వచ్చే స్వర్ణ రకం రైతులకు ప్రయోజనకరం.

ఎంటీయు 1318

2022లో విడుదలైన 1318 రకం పడిపోని స్వర్ణగా ప్రాచుర్యం పొందింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు తూర్పుగోదావరి, కృష్ణ జిల్లాలకు సైతం అనువుగా ఉంటుంది. 150 రోజులు పంట కాలంతో రెండు వారాలు నిద్రావస్థ ఉండడంతో చేనులో గింజలు మొలకెత్తే అవకాశం లేదు. అగ్గి తెగులు, మెడ విరుపు, పొట్టకుళ్ల తెగుళ్లను కొంత వరకు తట్టుకుంటుంది. హెక్టారుకు సుమారు 7.5 టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది.

ఎంటీయు 1064

2008లో విడుదలైన ఎంటీయు 1064 రకం పైరు పడిపోదు. రెండు వారాలవరకు ముంపును తట్టుకుంటుంది. దోమపోటు, ఎండాకు తెగులును సైతం తట్టుకుంటుంది. 150 రోజుల్లో పంటకు వచ్చే ఈ రకం హెక్టారుకు 7.5 టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది.

ఎంటీయు 1061(ఇంద్ర)

2006లో విడుదలైన ఇంద్ర రకం ధాన్యం తెలుపు రంగులో ఉంటుంది. చౌడును తట్టుకుని అధిక దిగుబడినిస్తుంది. పిలక దశలో 10 రోజులు వరకు ముంపును తట్టుకుంటుంది. సన్న, పచ్చి బియ్యానికి అనుకూలమైంది. మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది.

ఎంటీయు–1140(భీమ)

భీమ పంటకాలం 145 రోజులు. పైరు ఎదిగే దశలో 10 రోజుల వరకు ముంపును తట్టుకుంటుంది. దోమపోటును తట్టుకునే రకం.

ఎంటీయు–1224(మార్టేరు సాంబ)

మార్టేరు సాంబ రకం బియ్యం సన్నగా ఉంటుంది. 135 రోజుల్లో పంట చేతికి వస్తుంది. దోమపోటును తట్టుకోవడమేగాక బియ్యం పారదర్శకంగా ఉండి అన్నానికి బాగుంటుంది.

అనువైన వంగడాలు ఎంపిక చేసుకోవాలి



సార్వా సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్న తరుణంలో ప్రధానంగా విత్తన ఎంపికపై దృష్టిపెట్టాలి. రైతులు సాగుచేసే భూములకు అనువుగా ఉండే విత్తనాలు వేయాలి. మంచి దిగుబడినిచ్చే రకాలతోపాటు ముంపు, చీడపీడలను తట్టుకునే రకాలు మేలు. సాగు ఖర్చులను తగ్గించుకోడానికి యాంత్రీకరణతో పాటు అవసరం మేరకు ఎరువులు, పురుగుమందులు వినియోగించుకోవాలి.

– ఎంవీ కృష్ణాజీ, వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, మార్టేరు

30న రాష్ట్ర చర్మకారుల సదస్సు



వివరాలు వెల్లడిస్తున్న చర్మకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలిమేర హరికృష్ణ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 30న ఏలూరులో రాష్ట్ర చర్మకారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలిమేర హరికృష్ణ తెలిపారు. స్థానిక 44వ డివిజన్ గన్‌బజార్‌లోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సదస్సుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చర్మకారుల సంక్షేమ సంఘం స్థాపించి 30 సంవత్సరాలు పూర్తయ్యాయని తెలిపారు. ఫిబ్రవరి, మార్చిలో తలపెట్టిన సదస్సును ఎన్నికల కారణంగా జూన్ 30న నిర్వహిస్తున్నామని చెప్పారు. సదస్సుకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. సమావేశంలో చర్మకార సంఘం నాయకులు బేవునపల్లి లక్ష్మణ్, జొన్నకూటి రవి, ముల్లుల రమేష్, పాలిమేర రాజు, కటారి రాజేష్, బడుగు రామకృష్ణ, ఎర్ర సత్యానందం, కులసాల పోతురాజు, పాలిమేర దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

లారీ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు



కొయ్యలగూడెం: అదుపుతప్పి క్వారీ లారీ టైర్ల దుకాణంలోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలో బయ్యనగూడెం గ్రామ శివారు పెట్రోల్ బంకు వద్ద శనివారం చోటుచేసుకుంది. సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యలగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వైపుగా వెళుతున్న లారీ పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా అదుపుతప్పి టైర్ల దుకాణంలోకి దూసుకుపోయిందన్నారు. ఈ సమయంలో బయ్యనగూడెం నుంచి పెట్రోల్ బంక్ వైపు వస్తున్న ద్విచక్ర వాహన దారుడికి, లారీక్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



జంగారెడ్డిగూడెం పారిజాతగిరి శ్రీవెంకటేశ్వర స్వామికి గరుడ వాహనంపై గ్రామోత్సవం





విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరిలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో బ్రహ్మోత్సవాల ఐదో రోజు నిత్య పూజా కైంకర్యాలతో పాటు హోమాలు, వివిధ రకాల అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు నల్లూరి రవికుమారాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుద్దాల నాగదుర్గారావు, కృష్ణవేణి దంపతులు, పూదోట సతీష్‌చంద్, లక్ష్మీసూర్య ప్రసన్న దంపతులు, వల్లభనేని శ్రీనివాసరావు, ప్రసన్నలక్ష్మి దంపతులు, దారా రవీంద్ర, సునీత దంపతులు, ఇండిపికాయల శ్రీనివాస్, వెంకట పద్మావతి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం 5 గంటల నుంచి పట్టణ ప్రధాన రోడ్లు, వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని గరుడ వాహనంపై ఉంచి ఊరేగించారు. గ్రామోత్సవంలో కోలాటం, భజనలు, విచిత్ర వేషధారణలు, మేళతాళాల నడుమ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆలయ ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య



మృతుడు యడ్లపల్లి సతీష్

ద్వారకాతిరుమల: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది, పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిమ్మాపురంలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపురానికి చెందిన యడ్లపల్లి రమేష్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె. పెద్ద కుమారుడు యడ్లపల్లి సతీష్ (30) నల్లజర్ల మండలం చోడవరంలో నివసిస్తున్నాడు. జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సతీష్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గత నెల 31న ఉదయం సతీష్ తిమ్మాపురంలోని చెరువు గట్టుపై పురుగుల మందు తాగి పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి, తండ్రి రమేష్‌కు తెలిపారు. క్షతగాత్రుడిని హుటాహుటిన తొలుత భీమడోలులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన యువకుడు, అతనికి సహకరించిన వారిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబస్ తెలిపారు. 8వ తరగతి చదువుతున్న బాలిక తల్లితో కలిసి వేగవరంలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. అదే గ్రామానికి చెందిన బల్లా రాజ్‌పాల్ బాలికను ప్రేమిస్తున్నానని 6 నెలలుగా వేధిస్తున్నాడు. ఏప్రిల్ 29న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజ్‌పాల్ బాలిక ఇంటికి వెళ్లి అత్యాచారయత్నం చేశాడు. మే 21న మరోసారి బాలిక ఇంటికి వెళ్లి బెదిరిస్తూ డబ్బులు అడిగాడని, దీంతో బీరువాలో ఉన్న రూ. 1.50 లక్షల నగదులో నుంచి రూ. 500 తీసి రాజ్‌పాల్‌కు బాలిక ఇచ్చిందన్నారు. బీరువాలో నగదు గమనించిన రాజ్‌పాల్ బాలికను కూల్‌డ్రింక్ తెమ్మని బయటకు పంపాడని, కూల్ డ్రింక్ తెచ్చాక తాగి అక్కడ నుంచి వెళ్లిపోయాడన్నారు. మే 24న బాలిక అమ్మమ్మ బీరువాలో డబ్బులు చూసుకోగా, కనిపించలేదని, బాలికను అడగ్గా జరిగిన విషయం చెప్పిందన్నారు. విషయాన్ని బాలిక అమ్మ, అమ్మమ్మలు గ్రామ పెద్దల సమక్షంలో పెట్టగా, రాజ్‌పాల్, అతనికి సహకరించిన ముగ్గురు బెదిరించినట్లు చెప్పారు. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.జ్యోతి బాస్ తెలిపారు.

ఘనంగా హనుమాన్ కల్యాణోత్సవం



పెదపాడులో సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి కల్యాణోత్సవం



అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో, పెదపాడులోని సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో, గండిచెరువుగట్టు వీరాంజనేయస్వామి ఆలయంలో, ఏపూరులోని సీతారామ లక్ష్మణ సమేత అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమద్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులు బారులు తీరారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ఉదయం మల్లెపూలతో పూజలు చేశారు. అనంతరం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరాంజనేయ స్వామి ఆలయంలో ధర్మకర్తల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. హోమాలు అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు వెంకటరమణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బిళ్లగుంట రోడ్డులో వ్యక్తి ఆత్మహత్య



పెంటపాడు: పెంటపాడు మండలంలోని దర్శిపర్రు గ్రామ పరిధిలోని బిళ్లగుంట రహదారి పక్కన 45 సంవత్సరాల వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పెంటపాడు ఎస్సై కె.శంకర్ తెలిపిన వివరాల ప్రకారం బిళ్లగుంట శివారులో శుక్రవారం సాయంత్రం సమయంలో చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి మృతి చెందిన విషయాన్ని స్థానికులు సమాచారమిచ్చారన్నారు. గళ్ల లుంగీ, బిస్కట్ కలర్ చొక్కా ధరించి ఉన్న వ్యక్తి ఆచూకీ తెలిస్తే పెంటపాడు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. మృతుడు బెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 94407 96613, 08818 222081 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి

దెందులూరు : మలకచర్లలో రామారావుగూడెం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కే.రమణను ఉపాధి కూలీ వీ.శ్రీను తిట్టి గాయపరిచాడు. మరో ఇద్దరు కూలీలు సైతం దౌర్జన్యం చేశారని ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణ దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాయం కావడంతో హుటాహుటిన ఆయనను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం దాడిని ఖండించింది. విధి నిర్వహణలో ఉద్యోగులపై దాడులు, దౌర్జన్యాలు చేయడాన్ని తప్పుపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను రామారావుగూడెం సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్, ఉపసర్పంచ్ కస్సే శ్రీనివాసరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు తదితరులు పరామర్శించారు.

క్లుప్తంగా

రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించాలి



అత్తిలి మండలం తిరుపతిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

అత్తిలి : రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. అత్తిలి మండలం తిరుపతిపురంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రుతు పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ కిశోర బాలికలు సమతుల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కిశోర బాలికలు ఆకుకూరలు, గుడ్డు, పాలువంటి సమతుల ఆహారాన్ని తీసుకుంటే ప్రతి నెలా రుతుక్రమం జరుగుతుందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం



గ్రంథాలయంలో చిన్నారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పుస్తక పఠనం అలవరుచుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. గరికపాటి బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, వి.రామాంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు అరిస్టాటిల్, అలెగ్జాండర్ జీవిత విశేషాలను, నీతి కథలు, ఆధ్యాత్మిక విషయాలను వెల్లడించారు. పి.పాండు యోగా క్లాసులను నిర్వహించారు.

విద్యార్థులకు యోగా శిక్షణ

తణుకు టౌన్ : విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కే సత్యనారాయణ, వైఎస్ఎన్ వసంతరావు, బసవేశ్వరరావు, గ్రంథాలయ అధికారి సాయిబాబా పాల్గొన్నారు.

సంస్కృత పరీక్షకు 50 మంది గైర్హాజరు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదోతరగతి సప్లమెంటరి పరీక్షల్లో భాగంగా శనివారం ఎనిమిదో రోజు సంస్కృతం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్, కడకట్ల మున్సిపల్ హైస్కూల్, సుబ్బారావుపేట మునిసిపల్ హైస్కూల్, కింబర్లీ, మాంటిస్సోరి, సెంట్ జోన్స్, భాష్యం స్కూళ్లలో పరీక్షలు నిర్వహించారు. 64 మంది విద్యార్థులకు 14 మంది పరీక్షలకు హాజరవ్వగా, 50 మంది గైర్హాజరయ్యారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు

అత్తిలి: ఈడూరు గ్రామంలోని వరాల వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు చేశారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ నిర్వహించారు. ఉదయం స్వామి వారిని విశేషంగా అలంకరించి అర్చనలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్‌డీఎస్ఎస్ స్కీంలో భాగంగా మరమ్మతుల నిమిత్తం హౌసింగ్ బోర్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సత్యవతి నగర్, నిట్ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. వన్‌టౌన్‌లోని వానపల్లిగూడెం, వీకర్స్‌కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, గాయత్రి గుడి ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని, వినియోగదారులు సహకరించాలన్నారు.

స్నేహభావంతో మెలగాలి

ఆకివీడు: ఎన్నికల ఫలితాలపై అతిగా స్పందించడం మంచిది కాదని, ప్రజలు ఆవేశాలకు గురికావద్దని ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై బీ నాగబాబు సూచించారు. స్థానిక మాదివాడలో పలు చోట్ల శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫలితాల్లో ఎవరు విజయం సాధించినా, ఓటమిపాలైనా ప్రజలు ఓర్పు సహనంతో ఉండాలన్నారు. మీరు వేసిన ఓట్లతోనే గెలుపోటములుంటాయని వివరించారు. ఎన్నికలు పూర్తయినందున ప్రజలు స్నేహభావంతో, శాంతియుత వాతావరణంలో మెలగాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంత్యుత్సవం



కె.పెంటపాడులో హనుమాన్ ఆలయంలో పూజలు



కె.పెంటపాడు బైరాగమఠంలో పూజలందుకుంటున్న ఆంజనేయుడు



తాడేపల్లిగూడెంలో ర్యాలీలో పాల్గొన్న భక్తులు

పెంటపాడు: హనుమాన్ జయంత్యుత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పెంటపాడులోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఈవో శివ శంకర్ ఆధ్వర్యంలో ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్రపాలకుడైన ఆంజనేయుడికి అర్చకులు అప్పాలతో నైవేద్యం సమర్పించి, విశేష అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. కె.పెంటపాడు పెంట్లమ్మ ఆలయం ఎదురువీధిలో దాసాంజనేయస్వామి ఆలయంలో 3 వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. బొజ్జన్న, వీరాబత్తుల దానయ్య పాల్గొన్నారు. పరిమెళ్ల, యానాలపల్లి, మీనవిల్లూరులో హనుమాన్ జయంత్యుత్సవాలు నిర్వహించారు. అలంపురం అభయాంజనేయస్వామి ఆలయం వద్ద భారీ విగ్రహాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

జయంత్యుత్సవాలు ప్రారంభం

అత్తిలి: హనుమద్ జయంత్యుత్సవాలు శనివారం అత్తిలి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తి స్వామి వారిని దర్శించుకున్నారు. బల్లిపాడులో అభయాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. పాలూరు డ్యాం వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. స్వామివారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. కాసగాని సూరిబాబు, వెలగల సుదర్శనరెడ్డి దంపతులతో స్వామి వారికి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అత్తిలి మండలం కొమ్మరలో ఆంజనేయస్వామి ఆలయంలో లక్ష తమలపాకులతో పూజ చేశారు. ఆలయ అర్చకులు రామం ఆధ్వర్యంలో పలువురు వేదపండితుల సమక్షంలో పూజలు చేశారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

మహాలక్ష్మి చెరువులో అన్న సమారాధన

తణుకు టౌన్ : హనుమాన్ జయంతి సందర్భంగా తణుకు మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. వేల్పూరు, మహాలక్ష్మీ చెరువు, కొమరవరం, తేతలి, దువ్వ, ముద్దాపురంలోని ఆలయాల్లో ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. తణుకు పట్టణం మూడో వార్డులోని ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి చెరువులో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలా శ్రీను, ఎంపీటీసీ వెంకటదుర్గ, భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో రుద్రాభిషేకం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం హౌసింగ్ బోర్డు కాలనీ ఎంట్రన్స్‌లోని శ్రీ దక్షిణముఖ అభయ ఆంజనేయ స్వామి ఆలయం నిర్వాహకులు ఆకుల నరసింహమూర్తి, సేవా సమితి సభ్యులు హనుమాన్ పతాక బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయ స్వామికి రుద్రాభిషేకం, సాయంత్రం అప్పాల హోమం, రాత్రి సువర్చల సుందర హనుమాన్ పారాయణం నిర్వహించారు. కోతి బొమ్మ సెంటర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయంలో అభిషేకాలు, తమలపాకులతో, కుంకుమ పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. వాసవి ఆలయంలో 27 అడుగుల హనుమాన్ విగ్రహానికి విశేష పూజలు చేశారు.

తణుకు సబ్ జైలులో జిల్లా జడ్జి తనిఖీ



తణుకు సబ్ జైలును తనిఖీ చేస్తున్న జిల్లా జడ్జి రత్నప్రసాద్

తణుకు అర్బన్ : జైళ్ల శాఖ నిబంధనలకు అనుగుణంగా రిమాండ్ ముద్దాయిలందరికీ అమలుకావాల్సిన సౌకర్యాలన్నీ సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ సూచించారు. తణుకు సబ్ జైలును ఆయన శనివారం తనిఖీ చేసి ముద్దాయిలకు అందుబాటులో ఉన్న వసతులపై ఆరా తీశారు. ముద్దాయిలు తమ కేసులకు సంబంధించి న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేకపోతే న్యాయసేవల సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు సాయిరాం, రంజిత్‌కుమార్, నాగరాజు, పీఎస్‌పీ చిరంజీవిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, జైలు సూపరింటెండెంట్ మోహనరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు





సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు, మాట్లాడుతున్న గూడెం ఆర్వో కె.చెన్నయ్య, పోలీసు అధికారులు

తాడేపల్లిగూడెం: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాడేపల్లిగూడెం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్య హెచ్చరించారు. వివిధ పార్టీల నాయకులతో శనివారం మాగంటి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో కౌంటింగ్‌కు ముందు, తర్వాత పాటించాల్సిన విధివిధానాలు వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మూర్తి హెచ్చరించారు. వాహనాలపై రాజకీయ నాయకుల తాలూకా అనే నేమ్‌ప్లేట్‌లు ఉంటే సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఊరేగింపులు, డీజేలో హంగామా, బాణసంచా కాల్పులు నిషేధించారని తెలిపారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, రమేష్, ఎస్సైలు పాల్గొన్నారు.

ముందస్తు హెచ్చరికలు..

ఎగ్జిట్ పోల్స్ సర్వేలు వెల్లడైన తరుణంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. వీధుల్లో మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున గుంపులుగా జనం ఉండకూడదన్నారు. లాడ్జీల్లో మూడు రోజులు ఎవరికి రూమ్‌లు కేటాయించొద్దని ఆదేశాలు ఇచ్చారు. మద్యం దుకాణాలను మూసివేస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరించారు.



బందోబస్తు విధుల్లో పోలీసులు

రౌడీ షీటర్లు, అనుమానితులపై నిఘా

- నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు
- తణుకు పట్టణ సీఐ ఎం.నాగరాజు



తణుకులో వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ నాగరాజు



తణుకులో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్న సీఐ నాగేశ్వరరావు

తణుకు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 4న కౌటింగ్ నేపథ్యంలో రౌడీ షీటర్లు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తణుకు పట్టణ సీఐ ఎం.నాగరాజు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. శనివారం తణుకులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే 144 సెక్షన్ తోపాటు పోలీసు యాక్ట్ 30 అమల్లో ఉన్నందున ప్రజలు రోడ్లపైకి వచ్చి గుంపులుగా ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. తణుకు పట్టణంలో 150 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. అనధికారికంగా సమావేశాలు ఏర్పాటు చేస్తే పోలీసు కేసులు నమోదు చేస్తామన్నారు. కౌంటింగ్ రోజున తణుకు పట్టణంలో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించడంతోపాటు పలు ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ రోజున విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం లేదా బాణసంచా కాల్చడానికి అనుమతులు లేవన్నారు. ఈనెల 6 వరకు ఎన్నికల్ కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఈనెల 4న ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, అనుమతించిన ఏజెంట్లు మినహాయించి మిగిలిన ఎవ్వరికీ భీమవరం వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. తణుకులోని రాజకీయ పార్టీల కార్యాలయాలతో పాటు ఆరు ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత అడ్మిన్‌లను బాధ్యులను చేస్తామని సీఐ నాగరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ

ఈనెల 4న కౌంటింగ్, ఫలితాలు వెల్లడి నేపథ్యంలో అందరూ శాంతియుతంగా వ్యవహరించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించవద్దని తణుకు రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఈనెల 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని విజేతలు, వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించేందుకు వీలులేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం తణుకు తేతలి వై జంక్షన్ వద్ద డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించారు. ఫలితాల వెల్లడి సమయంలో శాంతి భద్రతల నిర్వహణ కోసం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన 15 పోలీసు పికెట్లు ద్వారా శాంతిభద్రతలను అదుపులో ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన పూర్తయ్యే వరకు తణుకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎలాంటి ఊరేగింపు, నినాదాలు చేయడం, సంబరాలకు, లౌడ్ స్పీకర్లు ఉపయోగించడానికి వీలులేదన్నారు. ఫలితాల ప్రకటన తర్వాత ఏ అభ్యర్థి, రాజకీయ పార్టీల విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 188 ఐపీసీ ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

దేవాలయ భూముల కౌలుకు బహిరంగ వేలం



దేవాలయ భూముల కౌలు వేలం నిర్వహిస్తున్న ఈవో శివశంకర్, సిబ్బంది

పెంటపాడు : మండలంలోని విప్పర్రు గ్రూపు దేవాలయాల భూముల మూడేళ్ల కౌలు ప్రాతిపదికన బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా 67.25 ఎకరాలకు రూ.40.32 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయాల గ్రూపు ఈవో జి.శివశంకర్ తెలిపారు. గ్రామంలోని ఆదికేశవస్వామి, జనార్దనస్వామి, రాజేశ్వరస్వామి, మహాలక్ష్మి, మహంకాళమ్మ దేవాలయాల భూములు 67.25 ఎకరాలకు బహిరంగ కౌలు వేలం శనివారం స్థానిక జనార్దన స్వామి ఆలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో పాటదారులు పాల్గొన్నారు. కౌలు వేలంలో గతం కన్నా ఆదాయం పెరిగినట్లు ఈవో వెల్లడించారు. దేవదాయ శాఖ నిబంధనల మేరకు హెచ్చు పాటదారుడు సోమవారం లోపు సంవత్సరం మగతాను అడ్వాన్సుగా చెల్లించాలన్నారు. లీజు పూర్తయిన వెంటనే ఆ సొమ్ము తిరిగి పాటదారుడికి చెల్లిస్తామన్నారు. అర్చకులు కొడవటిగంటి నరసింహాచార్యులు, శంకరమంచి శాంతిబాబు, కొడవటిగంటి లక్ష్మణాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక పథకాలు



అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, ప్రత్యేక పథకాలపై దివ్యాంగులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే.బాలీశ్వరయ్య పేర్కొన్నారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా శనివారం స్థానిక వీకర్స్ కాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగులకు 21 రకాల వైకల్యాలు, దివ్యాంగ పిల్లలను గుర్తించే కరపత్రాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, వారిని పాఠశాలలో చేర్చేందుకు కృషి చేయాలన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయిని ఎం.చంద్రకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గ భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థినులకు అభినందనలు



తణుకు ప్రభుత్వ కళాశాలలో విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపక సిబ్బంది

తణుకు టౌన్: తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థిని ఎస్.మహాలక్ష్మి కూచిపూడి నృత్య ప్రదర్శనలో హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీ బంగారు నంది అవార్డుతో సత్కరించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. గత నెలలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనకు హైదరాబాద్‌కు చెందిన సాహితీ సంస్థ ద్వారా మహాలక్ష్మి బంగారు నంది అవార్డును పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది మహాలక్ష్మిని అభినందించారు. ఎడెక్స్ ద్వారా ప్రపంచంలోని వివిధ యూనివర్సిటీల నుంచి ఆన్‌లైన్ ద్వారా 19 కోర్సులను పూర్తి తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థినీ ఎస్ జ్ఞాన శ్రీదుర్గా పద్మావతిని ప్రిన్సిపాల్, సిబ్బంది శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికీ రూ. 5 వేల నగదు పురస్కారం అందజేసి అభినందించినట్లు తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్, ఆర్ఎస్ఎం భూపాల్, అధ్యాపకులు డీ కనక మహాలక్ష్మి, పీసీహెచ్ దేవి, ఐవీ నారాయణ, డాక్టర్ టీ సంధ్యారాణి, జేకేసీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పశువులకు తక్షణం టీకాలు వేయించాలి



రైతులకు పశువుల మందులు అందిస్తున్న మండల వైద్యాధికారి మహేష్

పెంటపాడు : రైతులు వేసవి ముగిసిన అనంతరం పశువులలో వచ్చే వ్యాధులకు తక్షణం టీకాలు వేయించాలని డివిజన్ పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో శనివారం దర్శిపర్రులో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ అనిల్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాలంలో పశువుల్లో విపరీతంగా పెరిగే వ్యాధుల్లో జబ్బ వాపు, గొంతు వాపు ప్రధానమైనవని తెలిపారు. ముందస్తుగా పశువులకు టీకాలు వేయించి పాడి గేదెలను కాపాడుకోవాలన్నారు. దర్శిపర్రు గ్రామ సహాయకులు సునీల్‌కుమార్, వెటర్నరి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కొండాలమ్మ జాతర





అత్తిలిలో కొండాలమ్మవారి అభిషేకానికి బిందెలతో జలాలను తీసుకువెళుతున్న మహిళలు , జలాలతో అభిషేకిస్తున్న దృశ్యం

అత్తిలి: బల్లిపాడు రోడ్డులోని కొండాలమ్మవారి 8వ వార్షిక జాతర మహోత్సవాలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం మహిళలు బిందెలతో పవిత్ర జలాలను మేళతాళాలు, బాణ సంచాకాల్పుల నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి అభిషేకించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చలిమిడి, పానకాలు సమర్పించి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆసాదుల గరగనృత్యాలు, డప్పువాయిద్యాల నడుమ అమ్మవారి జాతర మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకుడు దాసరి శ్రీనివాస్ తెలిపారు.